# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 12-10-2025 సమయం : రాత్రి 8 గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ అట్టడుగు స్థాయిలో ఉన్న వారికి న్యాయం చేరువ చేయడంలో న్యాయ స్థానాలు కీలక పాత్ర పోషిస్తాయని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి. ఆర్. గవాయ్ పేర్కొన్నారు.

- ❖ యువతను మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్ది వికసిత్ భారత్ లో భాగం చేయాలని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయ అన్నారు.

- ❖ విపత్తు సంసిద్ధతకు స్వదేశీ సాంకేతిక అంచనా వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో భారత వాతావరణ విభాగం (ఐఎండీ) పురోగతి సాధించిందని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు.

- ❖ ఆస్ట్రేలియా, భారత్ మహిళల జట్ల మధ్య విశాఖ వేదికగా జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌లో భారత్ ఆస్ట్రేలియాకు 331 పరుగుల లక్ష్యాన్ని నిర్ధేశించింది.

=================

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నిర్దేశించిన సూత్రాలకు అనుగుణంగా న్యాయం ఉండాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ అన్నారు. మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా మందన్‌గడ్ తాలూకాలో నూతన సివిల్, క్రిమినల్ కోర్టు భవనాలను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నూతనంగా ప్రారంభించిన న్యాయస్థానాలు అట్టడుగు స్థాయిలో ఉన్న వారికి న్యాయం చేరువ చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ చంద్రశేఖర్, డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే పాల్గొన్నారు.

=================

సీషెల్స్ దేశ అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డాక్టర్ పాట్రిక్ హెర్మినీకి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి స్పందిస్తూ... డాక్టర్ హెర్మినీ అధ్యక్షుడిగా ఉన్న కాలంలో భారతదేశం, సీషెల్స్ మధ్య బహుముఖ సంబంధాలు మరింతగా అభివృద్ధి

చెందుతాయని ప్రధానమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. హిందూ మహాసముద్ర జలాలు ఉమ్మడి వారసత్వమని, ఇరు దేశాల ప్రజల ఆకాంక్షలు, అవసరాలను పెంపొందిస్తాయని నరేంద్రమోదీ పేర్కొన్నారు.

=================

భారత్ - ఆస్ట్రేలియా 4వ విడత సంయుక్త సైనిక విన్యాసాలు ఆస్ట్రేలియాలోని పెర్త్‌లో రేపు ప్రారంభం కానున్నాయి. 120 మంది సిబ్బందితో కూడిన భారత సైనిక దళం ఈ విన్యాసాలలో పాల్గొంటున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కార్యాచరణ సామర్థ్యాలను మెరుగుపరుచుకోవడానికి, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను ఒక చోటికి చేర్చడానికి, పోరాట సమయంలో సంయుక్తంగా పని చేయడానికి ఈ విన్యాసాలు విలువైన అవకాశాన్ని అందిస్తాయని రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

=================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించి, గత నెల 22న ప్రారంభమైన జీఎస్టీ బచత్ ఉత్సవ్ మొత్తం దేశానికి ప్రయోజనం చేకూరుస్తోంది. కొత్త జీఎస్టీ సంస్కరణ ఉత్తరప్రదేశ్‌లోని చేతివృత్తుల వారు, రైతులు, చిన్న సంస్థలకు ఒక పెద్ద ప్రోత్సాహకంగా మారింది. సవరించిన రేట్ల ప్రకారం అనేక వస్తువుల పన్నులు తగ్గి.. స్థానిక ఉత్పత్తులు మరింత తక్కువ ధరలకు అందుబాటులోకి వచ్చాయి. 2 వేల 5 వందల రూపాయల వరకు ధర ఉన్న వస్తువులు ఇప్పుడు కేవలం 5 శాతం GST వర్తించే కారణంగా.. కాన్పూర్, ఆగ్రాలోని తోలు, పాదరక్షల పరిశ్రమలు ప్రయోజనం పొందుతున్నాయి. అదే విధంగా లక్నోలోని చికంకారి వంటి చేతి ఎంబ్రాయిడరీ పనులు 5 శాతం పన్ను స్లాబ్ కింద ఉంచడంతో వినియోగదారులకు మరింత తక్కువ ధరలకు లభిస్తాయి. ఈ చేతి పనులపై ఆధారపడిన వేలాది మంది కళాకారుల జీవనోపాధికి ఊతం లభిస్తుంది. ఫిరోజాబాద్ జిల్లాలో జీ.ఐ. ట్యాగ్ నమోదు చేసుకున్న చేతి పనుల గాజు సామాగ్రి, గాజులపై GSTని 5 శాతానికి తగ్గిడంతో ఈ వస్తువులు 6 నుండి 7 శాతం చౌకగా లభిస్తున్నాయి.

=================

ఈ నెల 14వ తేదీ నుండి న్యూఢిల్లీలో జరిగే ఐక్య రాజ్యసమితి దళాల సహకార దేశాల (UNTCC) నాయుకుల సమావేశానికి భారత సైన్యం ఆతిథ్యం ఇవ్వనుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశంలో ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షక కార్యకలాపాలలో కీలక పాత్ర పోషిస్తున్న 32 దేశాల నుండి సీనియర్ సైనిక నాయకులు సమావేశమవుతారు. ఎదురువుతున్న సవాళ్లపై చర్చించి, భవిష్యత్ శాంతి పరిరక్షణ దిశగా ఉమ్మడి అవగాహనను పెంపొందించడం లక్ష్యంగా ఈ ఉన్నత స్థాయి సమావేశం జరుగుతుందని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ శాఖా మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్, శాంతి కార్యకలాపాల అండర్ సెక్రటరీ జనరల్ జీన్ పియరీ లాక్రోయిక్స్ ఈ కార్యక్రమంలో ప్రసంగిస్తారు.

=================

కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈరోజు భారత వాతావరణ విభాగం (ఐఎండీ)ను సందర్శించారు. ఐఎండీ అంతర్గతంగా అభివృద్ధి చేసిన వెబ్-GIS ఆధారిత బహుళ-ప్రమాద ముందస్తు హెచ్చరిక నిర్ణయ సహాయ వ్యవస్థ (DSS)ను పరిశీలించారు. దేశవ్యాప్తంగా విపత్తు సంసిద్ధత వ్యవస్థను బలోపేతం చేసే స్వదేశీ, సాంకేతికత ఆధారిత వాతావరణ అంచనా వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో ఐఎండీ సాధించిన పురోగతిని మంత్రి ప్రశంసించారు.

విరామం

=================

దేశ వ్యాప్తంగా మాదకద్రవ్య రహిత కార్యక్రమాన్ని ప్రారంభించి ఇస్కాన్ చేస్తున్న కృషిని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖా మంత్రి మన్సుఖ్ మాండవీయ ప్రశంసించారు. న్యూఢిల్లీలో ఈరోజు ఇస్కాన్ నిర్వహించిన ఉద్గార్ యువజనోత్సవానికి హాజరైన కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... దేశంలోని లక్షలాది మందిని మాదకద్రవ్య రహితంగా మార్చడం, వారిని వికసిత్ భారత్ ప్రచారంలో చేర్చడం ఈ కార్యక్రమం లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమం కింద 15 వేల మందికి పైగా యువకులు మాదకద్రవ్య రహితంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారని మన్సుఖ్ మాండవీయ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=================

నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (NSG) 26వ స్పెషల్ కాంపోజిట్ గ్రూప్ (SCG) ముంబైలో ఈరోజు సైకిల్ థాన్ నిర్వహించింది. ముంబై ఉగ్రవాద దాడుల ఘటనలో వీర మరణం పొందిన మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే విధంగా NSG వ్యవస్థాపక దినోత్సవ వేడుకల ప్రారంభం సందర్భంగా గర్భాశయ క్యాన్సర్, ఫిట్ ఇండియా కార్యక్రమాలపై అవగాహన పెంచడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో 250 మందికి పైగా ప్రొఫెషనల్ సైక్లిస్టులు, NSG సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

=================

జమ్మూ కాశ్మీర్ లో జరుగనున్న రాజ్యసభ ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ (బిజెపి) ముగ్గురు అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. అభ్యర్థులుగా గులాం మొహమ్మద్ మీర్, రాకేష్ మహాజన్, సత్పాల్ శర్మను ఎంపిక చేసింది. ఈ నెల 24న కేంద్రపాలిత ప్రాంతంలోని నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

=================

దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన 20వ విడత ఢిల్లీ హాఫ్ మారథాన్ 2025ను కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖా మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ఈ రోజు జెండా ఊపి ప్రారంభించారు. అన్ని వయసుల వారు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి కూడా పాల్గొన్నారు.

=================

రానున్న మూడు, నాలుగు రోజుల్లో నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, తెలంగాణ, తమిళనాడు కొన్ని ప్రదేశాలలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసింది. మరిన్ని వాతావరణ వివరాలను ఐఎండీ శాస్త్రవేత్త ఉమా శంకర్ దాస్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=================

మహిళల వన్డే క్రికెట్ ప్రపంచ కప్‌లో భాగంగా విశాఖపట్నం వేదికగా ఆస్ట్రేలియా భారత్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 48.5 ఓవర్లకు 330 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఆస్ట్రేలియా 18 ఓవర్లు పూర్తయ్యే సరికి ఒక వికెట్ నష్టపోయి 116 పరుగులు చేసింది.

=================

=================